TGTEL/26/A6221





**తొలివెలుగు** జాతీయపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.

సెల్ : 9491134365


# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ పత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA


**విలేకరులు కావలెను**

**తొలివెలుగు** జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365



| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 34 | ఆదివారం | 30-ఆగస్టు -2026 | ఎడిటర్ : యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume: 01 | Issue:34 | Sunday | 30-8-2026 | Editor: Yamjala Praveen | Pages: 8 | Cost: 2/- |





## దళితులపట్ల అడుగడుగునా వివక్ష

- ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసు పెట్టాలి
- బీజేపీ–ఆర్ఎస్ఎస్‌లు
- అంటరాతనం పాటిస్తున్నాయి
- అంటరానితనం శిక్షార్హమైన నేరం
- రాహుల్ గాంధీ ధ్వజం

### అధికారంలో ఒక మాట...

## ఇప్పుడొక మాట

- ఏకగ్రీవాలపై గత ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సీఎం చంద్రబాబు విమర్శ
- గిరిజన ప్రాంతాల్లో 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం
- రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- గత పాలనలో జే బ్రాండ్లు, బలవంతపు మత మార్పిడులతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపణ
- సెప్టెంబర్ 2న అనకాపల్లికి గోదావరి జలాలు, 31న వెలిగొండకు కృష్ణా జలాలు విడుదల



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల విషయంలో గత పాలకులు ఇప్పుడు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించి, ఇప్పుడు వాటిని వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అరకు నియోజకవర్గంలోని గన్నెలలో శనివారం జరిగిన 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

- మిగతా 2వ పేజీలో

# ‘సర్’ దిద్దండి

- ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సీఎం రేవంత్ లేఖ
- అభ్యంతరాలు, నోటీసులకు సమాధానమిచ్చే గడువులను పొడిగించాలి
- 73.39 లక్షల మంది ఓటర్లను ఏఎస్‌డీడీ లిస్ట్‌లో పెట్టడం ఆందోళనకరం
- శాశ్వత, తాత్కాలిక వలసల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించలేకపోయారు
- మరో 92.86లక్షల మంది ఓటర్లకు నోటీసులు
- వీరు ఆధారాలు చూపించుకోకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం



సర్‌లో చట్టబద్ధమైన నోటీసు మెకానిజమ్ లేదు. వలస వెళ్లిన కేటగిరీ కింద ఓట్లను తొలగించే ముందు ఓటర్లకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వడం లేదు. వ్యత్యాసాలు కలిగిన, లింక్ కాని ఓటర్లకు మాత్రమే నోటీసులు ఇస్తున్నారు. మళ్లీ ఎన్నికలు జరిగినప్పుడు ఓటేయడానికి పోతేనే తమ ఓటు పోయిందనే నిజం ఓటరుకు తెలుస్తుంది.

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్)--2026 ప్రక్రియ లోపభూయిష్టంగా తయారైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. గత జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లుండగా, 73.39 లక్షల (21.7%) మంది ఓటర్లను ఆచూకీ లేని/గైర్హాజరీలో ఉన్న/మరణించిన/డూప్లికేట్ (ఏఎస్‌డీడీ) ఓటర్లుగా గుర్తించడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వీరిలో 45.19 లక్షల (62%) మంది ఓటర్లను ఏ ప్రాతిపదికన

- మిగతా 2వ పేజీలో



## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

- తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన
- మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- సెప్టెంబర్ 2 వరకు వర్షాల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వెల్లడి
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో వేగంగా మారుతున్న ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వాసులు, రైతులు

- మిగతా 2వ పేజీలో




## రాష్ట్రాన్ని నాశనం చేయడమే జగన్ సంకల్పం


- జగన్ చేసిన విధ్వంసాన్ని రాష్ట్ర ప్రజలు భరించలేకపోయారన్న రామ్మోహన్ నాయుడు
- రాజకీయ పబ్బం గడుపుకోవడానికే మీడియా ముందుకు వస్తున్నారని విమర్శ
- ఏపీని నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్య



## భారత్‌లో ముస్లింలు వద్దనుకునేవాడు హిందువే కాదు

- భారత్‌లో ముస్లింలకు స్థానం లేదనడం హిందుత్వం కాదన్న మోహన్ భగవత్
- న్యూయార్క్‌లో జరిగిన 'ఒకే ప్రపంచం, ఒకే మానవత్వం' సదస్సులో ఆయన ప్రసంగం
- వివిధ మార్గాలు ఒకే సత్యాన్ని చేరవేస్తాయని నమ్మడమే హిందూ ధర్మమని వివరణ
- ప్రతి మనిషికి గౌరవం ఉందని, మానవుల మధ్య ఎలాంటి తేడాలు లేవన్న ఆర్ఎస్ఎస్ చీఫ్
- భారత్ సంప్రదాయబద్ధంగా అందరికీ ఆశ్రయం కల్పించిందని గుర్తుచేసిన భగవత్

"భారతదేశంలో ముస్లింలకు స్థానం ఉండకూడదని ఏ హిందువైనా భావిస్తే, అతను అసలు హిందువే కాదు" అని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. హిందుత్వం అనేది ప్రతి మనిషి గౌరవాన్ని గుర్తిస్తుందని, ఒకే సత్యానికి చేరవేసే విభిన్న మార్గాలను అంగీకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన "ఒకే ప్రపంచం, ఒకే మానవత్వం" అనే మత పెద్దల సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన 2018లో ఢిల్లీలో తాను చేసిన ప్రసంగాల సిరీస్‌ను గుర్తుచేసుకున్నారు. "2018లో ఢిల్లీలో నేను ప్రసంగిస్తున్నప్పుడు, అక్కడున్న కొందరు ముస్లిం సోదరులు నన్ను ఒక ప్రశ్న అడిగారు.



## వరద బురదలో విల విల!

- నేపాల్‌లో 675 దాటిన మృతుల సంఖ్య 2,426 మంది జాడ గల్లంతు
- వరద 'సరస్సు'ఉప్పొంగుతుండటంతో పొంచి ఉన్న కొత్త ముప్పు
- సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని హెచ్చరిక
- విపత్కర పరిస్థితుల్లోనూ అలుపెరగక శ్రమిస్తున్న ఆర్మీ, పోలీసులు, వలంటీర్లు
- జలవిద్యుత్ కేంద్రం సొరంగం వద్ద కొనసాగుతున్న రెస్క్యూ
- భారత్‌చేస్తున్న సాయానికి కృతజ్ఞత తెలిపిన నేపాల్ అధ్యక్షుడు
- రంగంలోకి విదేశీ సహాయక బృందాలు
- పొంచి ఉన్న కుండపోత వర్షాలు

## తుమ్మిడిహట్టి బ్యారేజీ: మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి
- తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతే లక్ష్యం
- భారీ లిఫ్టులు లేకుండా గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల తరలింపునకు ప్లాన్
- సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల చర్చలు




## సర్' నోటీసుల జారీపై కలెక్టర్లకు తెలంగాణ సీఈవో సుదర్శన్ రెడ్డి కీలక సూచనలు

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కలెక్టర్లతో తెలంగాణ సీఈవో సమీక్ష
- బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు వ్యక్తిగతంగా నోటీసులు అందించాలని ఆదేశం
- విచారణకు రెండు రోజుల ముందే ఓటర్లకు సమాచారం ఇవ్వాలని స్పష్టం



# వరద బురదలో విల విల!

కత్మాండు: మెరుపులా వచ్చి పడిన వరద బురద విలయంలో పారిపోయేందుకు క్షణమైనా సమయంలేక జల సమాధి అయిన అభాగ్యుల సంఖ్య అమాంతం పెరిగింది. నేపాల్--టిబెట్ సరిహద్దు మంచుకొండల నుంచి ముంచుకొచ్చిన జల ప్రళయంలో మరణించిన వారి సంఖ్య శనివారానికి ఏకంగా 675 దాటింది. 320 మంది విదేశీయులుసహా 2,426 మందికిపైగా జనం జాడ తెలీడంలేదని నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో 183 మంది భారతీయులున్నారు. టిబెట్ వైపు ఏడుగురు చనిపోగా 554 మంది జాడ తెలీడంలేదని చైనా పేర్కొంది. భోటె కోశీ నదీపరీవాహక ప్రాంతంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు, నదిలో అంతకంతకూ పెరుగుతున్న నీటి మట్టాలు మళ్లీ స్థానికులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. వర్షం, బురద, చీకటిని సైతం లెక్కచేయకుండా బాధితులను కాపాడాలనే ఏకైక సంకల్పంతో 15 వేల మందికిపైగా సైనికులు అవిశ్రాంతంగా అన్వేషణ, సహాయక చర్యలను కొనసాగిస్తుండటంతో వందలాది మందిని భవన శిథిలాలు, బురద మేటల నుంచి కాపాడగలిగారు. అడవుల్లో తలదాచుకున్న వారికి హెలికాప్టర్ల ద్వారా ఆహార పొట్లాలను అందించారు. కాపాడిన వాళ్లను హెలికాప్టర్లలో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరోవైపు టిబెట్‌లోని ఛోచెన్ నది, పురెపు నదుల సంగమం వద్ద ఏర్పడిన వరద సరస్సులో నీటిమట్టాలు ప్రమాదకరస్థాయిలో కొనసాగడంతో మరోమారు జలఖడ్గం దూసుకొచ్చే ప్రమాదం పొంచి ఉందన్న హెచ్చరికలతో దిగువ నేపాల్‌వాసుల్లో భయాందోళనలు మరింత పెరిగాయి. సరస్సులో నీటి రంగు మారుతోందని, ఈ లెక్కన ఏ క్షణంలోనైనా కట్ట తెంచుకుని భారీస్థాయిలో నీరు కిందకు ఉగ్రరూపంలో ప్రవహించవచ్చని నేపాల్ ప్రభుత్వాన్ని చైనా అప్రమత్తంచేసింది. సరస్సు కట్టుతెంచుకుంటే సెకన్‌కు 500 ఘనపు మీటర్ల నీరు మెరుపువేగంతో కిందకు దూసుకొచ్చి ప్రళయం సృష్టిస్తుందని అధికారులు హెచ్చరించారు. దిగువ ప్రాంతాల వాళ్లు తాత్కాలికంగా ఎగువ అడవిలోకి వెళ్లి తలదాచుకోవాలని సూచించారు. తమ వారిని కోల్పోయి ఇల్లు, వాహనాలు, సామగ్రి కొట్టుకుపోవడంతో పలువురు జీవచ్ఛవాలుగా మారిపోయిన హృదయవిదారక దృశ్యాలు పలు చోట్ల దర్శనమిచ్చాయి. వరద ప్రభావిత 8 జిల్లాల్లో ఇప్పటిదాకా 2,465 మందిని రక్షించారు. వీరిలో 113 మంది భారతీయులు సహా మొత్తంగా 163 మంది విదేశీయులు ఉన్నారు. టిబెట్‌లోని గ్యిరోంగ్ కౌంటీలో 1,000 మందిని కాపాడారు. 8జిల్లాల్లో ఇప్పటిదాకా 669 మృతదేహాలు లభ్యమయ్యాయి. రాసువాలోని త్రిశూలి 3ఏ జలవిద్యుత్ కేంద్రాన్ని బురదమట్టి సగానికిపైగా కప్పేయడంతో లోపల చిక్కుకున్న దాదాపు 100 మంది సిబ్బందిని కాపాడేందుకు, రంధ్రం పెట్టేందుకు డ్రిల్లింగ్ యంత్రాలతో భారతీయ నిపుణులు రంగంలోకి దూకారు. భారత్‌లో సొరంగ సంబంధ సమస్యల్ని పరిష్కరించే 14 మందితో కూడిన నిపుణుల బృందాన్ని రప్పించారు. ఉత్తరాఖండ్‌లో మూడేళ్ల క్రితం సిల్క్యారా--బార్కోట్ సొరంగం కూలిన ఘటనలో 17 రోజుల తర్వాత 41 మంది సిబ్బందిని సురక్షితంగా కాపాడిన టన్నెల్ రెసరీ?క, మెడికల్ టీమ్ శనివారం ఘటనాస్థలికి చేరుకుంది. అంతర్జాతీయ సొరంగ నిపుణుడు ఆర్నాల్డ్ డెక్స్‌తోనూ నేపాల్ అధికారులు రెస్క్యూ ఆపరేషన్‌పై సమీక్షా సమావేశం జరిపారు. నేపాల్ ఆర్మీ, పోలీసులు, సాయుధ బలగాలతో కూడిన 82 మంది బృందం శుక్రవారం రాత్రి నుంచి బురదను తొలగిస్తూ లోపలికి సొరంగం లోపలికి వెళ్లేందుకు శతథా కృషిచేస్తోంది.

## తుమ్మిడిహట్టి బ్యారేజీ: మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## సర్' నోటీసుల జారీపై కలెక్టర్లకు తెలంగాణ సీఈవో సుదర్శన్ రెడ్డి కీలక సూచనలు

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీని అత్యంత నిక్కచ్చిగా, ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఓటర్లకు వ్యక్తిగతంగా నోటీసులు అందజేయాలని ఆయన స్పష్టం చేశారు. విచారణ జరిగే ప్రదేశం, తేదీ, సమయానికి సంబంధించిన వివరాలను కనీసం రెండు రోజుల ముందే ఓటరుకు తెలియజేయాలని నిర్దేశించారు. నోటీసు అందిన ఏడు రోజుల్లోగా వివరణ సమర్పించాలనే నిబంధనను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, విచారణ, వివరణల నమోదు ప్రక్రియను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. అలాగే, మ్యాపింగ్ కానీ లేదా ఇతర సాంకేతిక లోపాలు ఉన్న కేసుల జాబితాను రాజకీయ పార్టీలకు అందజేయాలని సీఈవో సూచించారు. నోటీసులకు స్పందనగా సమర్పించాల్సిన పత్రాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్థితిగతులపై ప్రతి వారం రాజకీయ పార్టీలకు నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో జి.ఎస్. చారి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని నాశనం చేయడమే జగన్ సంకల్పం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ కొనసాగించిన విధ్వంసాన్ని భరించలేకే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆ పార్టీని దారుణంగా ఓడించారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమర్శించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడమే జగన్ ఏకైక సంకల్పమని... అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై ప్రశ్నించే సత్తా లేక కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికే మీడియా ముందుకు వచ్చి విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించడానికి ఎంతో అవకాశం ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలకు జగన్ ఎందుకు రావడం లేదని రామ్మోహన్ నాయుడు నిలదీశారు. తన పార్టీ నేతలకు ఒక డైరెక్షన్ ఇవ్వడం కోసం, ఉనికిని కాపాడుకోవడం కోసమే ఆయన మాట్లాడుతున్నారని... కానీ, ఆయన చేస్తున్న విమర్శల్లో ఏ ఒక్కదానికి నేటికీ ఆధారాలు చూపించలేకపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు రాకూడదని, ఏ ఒక్కరూ బాగుపడకూడదనే దుర్బుద్ధితోనే జగన్ ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి కొండంత అండగా ఉన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దానిని ఖచ్చితంగా సాధించి తీరతామని ధీమా వ్యక్తం చేశారు.

## భారత్‌లో ముస్లింలు వద్దనుకునేవాడు హిందువే కాదు

(మొదటి పేజీ తరువాయి)

'మీరు హిందూ సంస్థ. హిందూ రాష్ట్రం గురించి మాట్లాడుతున్నారు. మరి మా ముస్లింల పరిస్థితి ఏంటి? మమ్మల్ని తరిమేస్తారా?' అని అడిగారు. అప్పుడు నేను వారితో, 'లేదు, అది హిందుత్వం కాదు. ఈ దేశంలో ముస్లింలు ఉండకూడదని ఏ హిందువైనా అనుకుంటే, అతను హిందువుగా తన అస్తిత్వాన్ని కోల్పోతాడు' అని చెప్పాను" అని భగవత్ వివరించారు. నిజమైన హిందూ గుర్తింపునకు మత వైవిధ్యాన్ని, ప్రతి వ్యక్తి సమానత్వాన్ని అంగీకరించడం తప్పనిసరి అని ఆయన అన్నారు. "మిమ్మల్ని మీరు హిందువు అని చెప్పుకోవాలంటే, అన్ని మార్గాలు ఒకే గమ్యానికి దారితీస్తాయని మీరు నమ్మాలి. ప్రతి మనిషికి గౌరవం ఉంది, మానవుల మధ్య ఎలాంటి తేడాలు లేవు. ఈ భిన్నత్వమే ప్రకృతికి అలంకారం. దాన్ని మనం గుర్తించాలి. కానీ ఎల్లప్పుడూ ఉండే వాస్తవం ఏమిటంటే, మనమంతా ఒక్కటే" అని భగవత్ ఉద్ఘాటించారు. తాను మత పండితుడిని లేదా మతాధికారిని కాదని, భారత సమాజంలో పనిచేయడం ద్వారా వచ్చిన అనుభవంతో మాట్లాడుతున్నానని భగవత్ సదస్సులో తెలిపారు. "మతాలు వేరైనా మానవత్వం ఒక్కటే అని చెప్పే సుదీర్ఘ సంప్రదాయం మాది. సత్యం ఒకటే, కానీ వివరించేవారిని బట్టి దానిని అనేక విధాలుగా వర్ణిస్తారు. ఎందుకంటే మానవులుగా, మన మెదళ్లలో సృష్టించబడిన సాఫ్ట్‌వేర్‌కు మనం బందీలం" అని ఆయన అన్నారు. చారిత్రక క్రమంలో విదేశీ దండయాత్రల వల్ల అనేక నాగరికతా సంపదలను కోల్పోయినప్పటికీ, అందరినీ కలుపుకొనిపోయే భారత సంప్రదాయం ఇప్పటికీ సజీవంగానే ఉందని ఆయన గుర్తుచేశారు. "భారత్ సంప్రదాయబద్ధంగా ప్రతి ఒక్కరికీ ఆశ్రయం ఇచ్చింది. అందుకే ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు కలిసి జీవిస్తున్నారు" అని పేర్కొన్నారు.

## అధికారంలో ఒక మాట...ఇప్పుడొక మాట

(మొదటి పేజీ తరువాయి)

"అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారం కోల్పోయాక మరో మాట మాట్లాడటం వారి నైజానికి నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవం అయితే, సదరు నియోజకవర్గ ఇన్చార్జిదే బాధ్యత... వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్ ఉండదు అని జగన్ వైసీపీ నేతలను హెచ్చరించిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించారని చంద్రబాబు ఆరోపించారు. 'జే బ్రాండ్లు' పేరుతో కల్తీ మద్యం అమ్మి వేల మంది ప్రాణాలతో చెలగాటమాడారని, ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. ఆర్డీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే గ్రూప్-1 పరీక్ష పత్రాలను ఒక ఎలక్ట్రీషియన్, అటెండర్‌తో దిద్దించి అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. ఇక తన పర్యటన ముఖ్య ఉద్దేశమైన 'సంజీవని' ప్రాజెక్టు వివరాలను సీఎం వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజల చెంతకే వైద్యం అందించే ఈ ప్రాజెక్టు, ఆరోగ్య రంగంలో తదుపరి స్థాయి విప్లవమని అభివర్ణించారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల మెరుగుదలకు రూ.250 కోట్లతో 'ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నామని, త్వరలో అన్ని మండలాల్లో జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డ్రోన్ల ద్వారా మారుమూల ప్రాంతాలకు మందులు, వ్యాక్సిన్లు పంపడంతో పాటు రక్త నమూనాలను ల్యాబ్‌లకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని వివరించారు. గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం ఐదు సూత్రాల ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 'అడవి తల్లి బాట' పేరుతో రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నామని, 1.60 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. అరకు కాఫీ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించి, హోమ్‌స్టేల ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహించి గిరిజనులకు ఆదాయ మార్గాలు పెంచుతామన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాల కోసం తీసుకొచ్చిన జీఓ నంబర్ 3ని గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సుప్రీంకోర్టు రద్దు చేసిందని, త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయం తెస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపైనా చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను, సెప్టెంబర్ 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల తీవ్రత సెప్టెంబర్ 2 వరకు కొనసాగే అవకాశం ఉందని, ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, రాజధాని హైదరాబాద్‌లో రానున్న 24 గంటల్లో ఆకాశం దట్టంగా మేఘావృతమై అప్పుడప్పుడు వాన చినుకులు పడే అవకాశం ఉందన్నారు.

వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని... చెట్లు, భారీ విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద నిలబడ వద్దని హెచ్చరించారు. వర్షం కురుస్తున్న సమయాల్లో వాహనదారులు ప్రయాణాల్లో వేగాన్ని తగ్గించి జాగరూకతతో వాహనాలు నడపాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

## దళితులపట్ల అడుగడుగునా వివక్ష

న్యూఢిల్లీ: 'శుద్ధీకరణ'వివాదంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీ లక్ష్యంగా విమర్శలకు దిగారు. కొన్ని రోజుల క్రితం ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను భారతీయ జనతా పార్టీ నేతలు శుద్ధి చేయడంపై పెద్ద ఎత్తున వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. ఆ ఘటన ఒక నేరమని, ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యులపై ఎస్సీ/ఎస్టీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చూడాలని రాహుల్ గాంధీ శనివారం డిమాండ్ చేశారు. దళితులు బాగుంటే ఓర్చుకోలేని బీజేపీ--ఆర్ఎస్ఎస్ మనస్తత్వం ఇదని ఆయన న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు. నేరం జరిగి 20 రోజులు అవుతున్నా ఇప్పటివరకూ ఎలాంటి చర్య తీసుకోలేదని ఎత్తి చూపారు. "కాంగ్రెస్ అధ్యక్షుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడికి న్యాయం కల్పించండి. న్యాయ దక్కేలా చేయడం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత."అని రాహుల్ వ్యాఖ్యానించారు. బీజేపీ ఉత్తరాఖండ్ విభాగం అధ్యక్షుడు మహేంద్ర భట్ 'శుద్ధీకరణ'ను సమర్థించుకున్నారని ఆరోపించిన రాహుల్.. ఆ "ఆ పని (శుద్ధీకరణ) చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నది మా డిమాండ్. ప్రధాని నరేంద్ర మోదీ తాను అన్ని కులాలకు చెందిన వాడినని, దేశానికి ప్రధానిని అని చెబుతూంటారు. కానీ ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మాత్రం శుద్ధీకరణను సమర్థించుకుంటున్నారు"అని విమర్శించారు. శుద్ధీకరణ చేసింది ఆర్ఎస్ఎస్ వాళ్లని, వారిపై ఎస్సీ/ఎస్టీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ప్రధాని ఆదేశించాలని రాహుల్ డిమాండ్ చేశారు. "హల్ద్వానీలో ఖర్గే ర్యాలీ జరిగిన రెండు రోజులకు ఆగస్టు పదవ తేదీన వాళ్లు శుద్ధీకరణ చేశారు. ఇది నేరం. ఆగస్టు 13న ఖర్గే ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తారు"అని గుర్తు చేశారు. "రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధమిది. రాజ్యాంగాన్ని అందించిన బీఆర్ అంబేద్కర్ లాంటి వారు, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూలు ఒకపక్కన ఉంటే బీజేపీ--ఆర్ఎస్ఎస్ ఇంకోపక్కన ఉన్నాయి" అని అన్నారు.

## 'సర్' దిద్దండి

(మొదటి పేజీ తరువాయి)

శాశ్వతంగా గైర్హాజరీ(వలస)లో ఉన్న ఓటర్లుగా వర్గీకరించారని ప్రశ్నించారు. 2.65 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయగా, 60.50లక్షల మంది ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు, 32.36లక్షల మంది అన్‌మ్యాప్డ్ ఓటర్లున్నట్టు నిర్ధారించినట్టు గుర్తు చేశారు. ఈ రెండు కేటగిరీలు కలిపి మొత్తం 92.86లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లు తమ ఓటు హక్కును నిలబెట్టుకోవడానికి మళ్లీ ఆధారాలు చూపించుకోవాల్సిన పరిస్థితి లేదా ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు శనివారం ఆయన లేఖ రాశారు. తాత్కాలిక, శాశ్వత వలసల మధ్య తేడా చూపలేదు. బీఎల్ఓ వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇంట్లో లేని ఓటర్లనూ శాశ్వతంగా వల స వెళ్లిన వారిగానే పరిగణించారు.

ఇల్లు మారిన ఓటర్లకు కొత్త చిరునామాలో ఓటు నమోదు చేసుకోవడానికి (ఫారం--6) ఎలాంటి సహాయం అందించడం లేదు, కానీ పాత ప్రదేశంలో వారి ఓటును తొలగిస్తున్నారు.

చట్టబద్ధమైన నోటీసు మెకానిజమ్ లేదు. వలస వెళ్లిన కేటగిరీ కింద ఓట్లను తొలగించే ముందు ఓటర్లకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వడం లేదు. వ్యత్యాసాలు కలిగిన, లింక్ కాని ఓటర్లకు మాత్రమే నోటీసులు ఇస్తున్నారు. మళ్లీ ఎన్నికలు జరిగినప్పుడు ఓటేయడానికి పోతేనే తమ ఓటు పోయిందనే నిజం ఓటరుకు తెలుస్తుంది. రాష్ట్రంలోని మూడో వంతు ఓటర్లు హైదరాబాద్, మేడ్చల్--మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉండగా, 58.6% ఏఎస్డీడీ ఓటర్లు, 41.9% నోటీసులు అందుకునే ఓటర్లు ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నారు. కొద్ది వందల మీటర్ల దూరంలో ఇల్లు మారినా పోలింగ్ స్టేషన్ మారుతుందని, వివాహం లేదా ఉద్యోగం కారణంగా ఇల్లు మారడం సాధారణమని, దానిని ఓటు హక్కు రద్దుకు కారణం చేయకూడదు.

**పూర్తిగా సహకరిస్తాం...**

అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు కోల్పోకూడదు, అర్హత లేని ఏ ఒక్కరూ జాబితాలో ఉండకూడదు అనేదే సర్ ప్రక్రియ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హెల్ప్‌డెస్?కల నిర్వహణ, గ్రామసభలు, వార్డు సమావేశాల ఏర్పాటు, ప్రచారం, అవగాహన కార్యక్రమాలు, లాజిస్టికల్ మద్దతుతో సహా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎన్నికల సంఘానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**సీఈసీకి రేవంత్ చేసిన ప్రతిపాదనలివీ..**

1. అభ్యంతరాలు, దరఖాస్తుల గడువు పొడిగించాలి. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలతోపాటు కొత్త ఓటర్ల నమోదు, వివరాల దిద్దుబాటుకు దరఖాస్తుల గడువు సెపట?టంబర్ 16 వరకు నెల రోజులు మాత్రమే ఇచ్చారు. సగం గడువు ముగిసింది. తుది జాబితా అక్టోబర్ 19న విడుదల కానుంది. ఓటర్లు తమ పేర్లు చెక్ చేసుకుని ఫారం--6 సమర్పించడానికి మరో 4 వారాల పాటు గడువును పొడిగించాలి. సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవు కాబట్టి ఈ సవరణ సులభమే.

# వరకట్న దాహానికి వివాహిత బలి

- అదనపు వరకట్న వేధింపులు తాళలేక అశ్విని ఆత్మహత్య
- భువనగిరి మండలంలో విషాదం.. భర్తపై కేసు నమోదు

**తొలివెలుగు, వలిగొండ/భువనగిరి :** అదనపు వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భువనగిరి మండల పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం ప్రకారం.. భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామానికి చెందిన అశ్వినికి కంచనపల్లికి చెందిన కొలిచేలిమి మహేష్‌తో 2023లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహం జరిగిన కొంతకాలం నుంచే అదనపు వరకట్నం తీసుకురావాలంటూ భర్త మహేష్ అశ్వినిని తరచూ వేధింపులకు గురిచేసేవాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో అశ్విని తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త మహేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

# ఘనంగా శ్రావణ మాస బోనాలు

- గ్రామదేవతలకు నైవేద్యాలు.. ప్రత్యేక పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తులు



**తొలివెలుగు, నిడమనూరు :** మండలంలోని సోమవారిగూడెం గ్రామంలో శనివారం శ్రావణ మాస బోనాల వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చెర్క సంధ్య శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా గ్రామదేవతలు కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లతో పాటు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సంప్రదాయబద్ధంగా బోనాలను సిద్ధం చేసి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. పూజా కార్యక్రమాలు భక్తి పారవశ్యంతో కొనసాగాయి. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగం చంద్రు, గ్రామ నాయకుడు బొల్లం సైదులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువతీయువకులు, వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల హక్కులపై ‘సమర శంఖారావం’

- రూ.6 వేల పింఛన్ హామీని నిలబెట్టుకోవాలి
- హామీలు నెరవేర్చేవరకూ పోరాటం తప్పదు: తన్నీరు హరీష్ రావు



**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** దివ్యాంగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ‘దివ్యాంగుల సమర శంఖారావం’ సభకు మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.బిఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్‌ను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చిందని, అప్పటి వరకు రూ.500గా ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,016కు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం దివ్యాంగులకు అందాల్సిన పింఛన్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసి దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరూపించుకోవాలని సూచించారు. దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వారి హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు స్పష్టం చేశారు.









# చెరువు కబ్జాపై వెనక్కి తగ్గిన రియల్ వ్యాపారులు!

- వరుస కథనాలతో కదిలిన అధికార యంత్రాంగం
- మల్లాయి చెరువులో వేసిన రోడ్డు తొలగిస్తామని హామీ
- 21 ఎకరాలకు పైగా శిఖం భూమి గుర్తింపు
- నీటిపారుదల శాఖ హద్దుల వరకు పనులు చేయబోమని స్పష్టీకరణ
- చెరువును కాపాడినందుకు హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, గ్రామస్తులు

తొలివెలుగు ఎఫెక్ట్

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం చల్లూరు గ్రామ పరిధిలోని మల్లాయి చెరువులో రోడ్డు వేసి కబ్జాకు ప్రయత్నించిన వ్యవహారంపై తొలివెలుగు వరుసగా కథనాలు ప్రచురించడంతో అధికార యంత్రాంగం కదిలింది. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించడంతో చెరువులో రోడ్డు నిర్మించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో సంబంధిత భూ యజమాని వెనక్కి తగ్గి, వేసిన రోడ్డును తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. శనివారం చల్లూరు గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాలనరసయ్య గౌడ్ చెరువులో జరుగుతున్న పూడ్చివేత, రోడ్డు నిర్మాణ పనులను గుర్తించి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇది వందల ఏళ్ల చరిత్ర కలిగిన చెరువని పేర్కొంటూ నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని చెరువు పరిధి, శిఖం భూమి, హద్దులను పరిశీలించారు. చెరువులోని కొంత భాగాన్ని పూడ్చివేసి రోడ్డు వేసిన విషయంపై అధికారులు విచారణ చేపట్టారు.

**21 ఎకరాలకు పైగా చెరువు శిఖం:**

అధికారుల పరిశీలనలో సర్వే నంబర్ 223లో 13 ఎకరాల 18 గుంటలు, సర్వే నంబర్ 224లో ఒక ఎకరం 29 గుంటలు, సర్వే నంబర్ 225లో 6 ఎకరాలు కలిపి మొత్తం సుమారు 21 ఎకరాల 7 గుంటల భూమి చెరువు శిఖం పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. ఈ భూమి నీటిపారుదల శాఖ పరిధిలోకి వస్తుందని అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది.

**గొలుసుకట్టు చెరువుగా కీలక పాత్ర:**

మల్లాయి చెరువు వందలాది ఎకరాల పంటలకు సాగునీరు అందించడంలో కీలకంగా ఉందని స్థానికులు తెలిపారు. చెరువు నిండితే చల్లూరు, మల్పవాని చెరువు, యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి, కాచారం తదితర ప్రాంతాలకు నీరు చేరుతుందని పేర్కొన్నారు. గొలుసుకట్టు చెరువుల వ్యవస్థలో మల్లాయి చెరువు కీలక పాత్ర పోషిస్తోందన్నారు. చెరువులో ఎలాంటి అభివృద్ధి పనులు, పూడ్చివేతలు చేపట్టకూడదని, దాని సహజ స్వరూపాన్ని యథాతథంగా కాపాడాలని నీటిపారుదల శాఖ అధికారులు సూచించినట్లు సమాచారం.

**రోడ్డు తొలగిస్తామని హామీ:**

ఈ సందర్భంగా భూ యజమాని శ్రీనివాసరావు స్పందిస్తూ, చెరువులో రోడ్డు వేయడం సమాచార లోపం కారణంగా జరిగిందని తెలిపినట్లు సమాచారం. వేసిన రోడ్డును వెంటనే తొలగిస్తామని, నీటిపారుదల శాఖ అధికారులు నిర్ణయించిన హద్దుల వరకు ఎలాంటి కట్టడాలు, అభివృద్ధి పనులు చేపట్టబోమని హామీ ఇచ్చారు.

**మళ్లీ ఆక్రమణకు ప్రయత్నిస్తే ఉద్యమం:**

ఇకపై చెరువు పరిధిలో ఎలాంటి పనులు చేపట్టబోమని భూ యజమాని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అయితే మరోసారి చెరువు ఆక్రమణకు లేదా పూడ్చివేతకు ప్రయత్నిస్తే రైతులు, గ్రామస్తులను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమిస్తామని సర్పంచ్ భీమగాని రూప బాలనరసయ్య గౌడ్ హెచ్చరించారు. చెరువు పరిరక్షణ కోసం తొలివెలుగు వరుసగా వెలుగులోకి తెచ్చిన కథనాల ఫలితంగా అధికారులు స్పందించి చర్యలు చేపట్టడం, రియల్ వ్యాపారులు వెనక్కి తగ్గడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో చల్లూరు గ్రామ ఉపసర్పంచ్ సుధాకర్, నీటిపారుదల శాఖ ఏఈ ప్రియ, అసిస్టెంట్ ఏఈ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# నేత్రదానంపై అపోహలు వీడాలి: మామిడి భీమ్‌రెడ్డి

- 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ
- నేత్రదాన ఉద్యమాన్ని మరింత విస్తరించాలని పిలుపు



**తొలివెలుగు, హయత్‌నగర్ :** నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను వీడి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా వాసన్ ఐ బ్యాంక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్రదాన అవగాహన ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మామిడి భీమ్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో నేత్రదానంపై మరింత విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కార్నియా సేకరణకు అవసరమైన శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులు, ఐ కలెక్షన్ సెంటర్లు తగిన సంఖ్యలో లేకపోవడం ప్రధాన సమస్యగా ఉందని పేర్కొన్నారు. ఈ లోటును అధిగమించేందుకు సంబంధిత సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. తద్వారా మరింతగా కార్నియాలను సేకరించి అవసరమైన వారికి చూపును అందించేందుకు కృషి చేయాలన్నారు. వాసన్ ఐ బ్యాంక్ ప్రతినిధి అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. కార్నియా సేకరణను పెంచేందుకు ఏఎస్‌జీ, వాసన్ సంస్థలు సంయుక్తంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఐ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు ఐ బ్యాంక్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో శిక్షణ పొందిన సిబ్బందిని అందుబాటులో ఉంచి, నేత్రదానం చేయాలనుకునే వారికి సులభంగా సేవలు అందించడమే లక్ష్యంగా వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ ఐ ఆర్గన్ బాడీ డోనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం మాట్లాడుతూ దేశంలో నేత్రదానాల సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న దేశమైన శ్రీలంకతో పోలిస్తే భారత్‌లో నేత్రదానాల సంఖ్య తక్కువగా ఉందని తెలిపారు. శ్రీలంక నుంచి ఇతర దేశాలకు సైతం కార్నియాలను అందించే స్థాయిలో అక్కడ నేత్రదాన ఉద్యమం అభివృద్ధి చెందిందని, భారత్‌లోనూ ప్రజలు పెద్ద సంఖ్యలో నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ అంజలి శుక్లా మాట్లాడుతూ.. నేత్రదాన ఉద్యమానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. అవగాహన కార్యక్రమాలను ఆసుపత్రులు, సంస్థలకే పరిమితం చేయకుండా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఒకరి నేత్రదానం ద్వారా ఇద్దరికి చూపును అందించే అవకాశం ఉంటుందని, నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ అవగాహన ర్యాలీలో డాక్టర్ కౌశిక్ చంద్రగిరి, హరినాథ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు. నేత్రదానం ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో ర్యాలీ నిర్వహించారు.

# ఎంఈఓ చందా రమేష్‌కు ఘన వీడ్కోలు

- పదవీ విరమణ సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం
- విద్యాభివృద్ధికి రమేష్ సేవలు ప్రశంసనీయం: డీఈఓ బొల్లారం బిక్షపతి
- ఉపాధ్యాయుల పాటలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణ

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) చందా రమేష్ పదవీ విరమణ సందర్భంగా శనివారం చల్మెడి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై చందా రమేష్‌ను ఆత్మీయంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి హాజరై మాట్లాడుతూ.. చందా రమేష్ విద్యాశాఖలో అందించిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. రాజాపేట మండలంలో విద్యాభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో చొరవ తీసుకుని సమన్వయంతో పనిచేశారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీతో వ్యవహరిస్తూ సహచరులు, ఉపాధ్యాయుల మన్ననలు పొందారని తెలిపారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి మాత్రమే పరిమితమని, సమాజానికి సేవ చేసే అవకాశం ఎప్పటికీ కొనసాగుతుందని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం చందా రమేష్ సంపూర్ణ ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో జీవించాలని



ఆకాంక్షించారు. అనంతరం డీఈఓ బొల్లారం బిక్షపతి, ఇతర విద్యాశాఖ అధికారులు చందా రమేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఎంఈఓగా చందా రమేష్ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకుంటూ, పదవీ విరమణ అనంతరం కూడా అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉండాలని కోరుకున్నారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:**

వీడ్కోలు కార్యక్రమంలో నమిల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నమిల భరత్ కుమార్ గౌడ్ పాడిన పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. పాటలు, నృత్యాలు, అభినయ ప్రదర్శనలతో కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# మృతురాలి కుటుంబానికి అండగా బీర్ల ఫౌండేషన్

- దొంతి యాదమ్మ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత
- ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటామన్న నాయకులు

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన దొంతి యాదమ్మ కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ అండగా నిలిచింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత సహకారంతో మృతురాలి కుటుంబ సభ్యులకు శనివారం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపదలో ఉన్న పేద, నిరుపేద కుటుంబాలకు బీర్ల ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కష్టకాలంలో కుటుంబాలకు చేయూతనివ్వడమే ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నెమిలే మహేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు పిండికూర మహేష్, గౌరవ అధ్యక్షుడు గోల్లెన స్వామి, రేగు సిద్ధులు, వార్డు సభ్యులు గుర్రం శ్రావణ్, గుర్రం రూపేష్, కొత్త ఉమేష్, గోల్లెన ప్రశాంత్, జయరాములు, దొంతి రాజు, దొంతి రమేష్, బిక్షపతి, కనకయ్య, కొండయ్య, కృష్ణ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ అండ

- కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి
- 50 కిలోల బియ్యం అందజేసిన బీర్ల అనిత
- ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం సోమారం గ్రామానికి చెందిన జంగా కార్తీక్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని శనివారం పలువురు పరామర్శించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ తరపున 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కుటుంబానికి ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో తమకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. పేద, నిరుపేద కుటుంబాలకు ఎప్పుడైనా ఆపద ఎదురైతే బీర్ల ఫౌండేషన్ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఆపదలో ఉన్న వారికి తోడుగా నిలవడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొలుసుల అనూష యాకుబ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మకంటి జంపయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ జంగ లక్ష్మీ యాదగిరి, వార్డు సభ్యులు బొమ్మకంటి సిద్ధిరాజు, జంగా యాదగిరి, చిన్నం సంపత్ కుమార్, గిరిరాజు ఆంజనేయులు, గొర్ల రాజు, పిల్లుట్ల వెంకటేష్, జంగా భానుచందర్, జంగా బాలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# భక్తి పారవశ్యం.. నమిలలో కాటమయ్యకు బోనాలు

లి డప్పు చప్పుళ్ల మధ్య కోలాహలంగా బోనాల ఊరేగింపు

లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన గౌడ కులస్తులు

లి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్న మహిళలు

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం నమిల గ్రామంలో శ్రీ కాటమయ్య బోనాల వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గౌడ కులస్తులు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య గ్రామ ప్రధాన వీధుల గుండా నృత్యాలు చేస్తూ, కోలాహలంగా ఊరేగారు. పసుపు, కుంకుమ, వేపాకులతో బోనాలను అలంకరించి భక్తిప్రపత్తులతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామాన్ని సుభిక్షంగా ఉంచాలని అమ్మవారిని వేడుకున్నారు. ఏటా సంప్రదాయంగా నిర్వహించే కాటమయ్య బోనాల వేడుకల్లో గౌడ కులస్తులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మొక్కులు ఉన్న భక్తులు బోనాలు ఎత్తుకుని అమ్మవారి సన్నిధికి చేరుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. బంధుమిత్రులు, గ్రామస్తులు ఒకచోట చేరడంతో గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. బోనాల ఊరేగింపులో మహిళలతో



పాటు యువత, చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పు వాయిద్యాల నడుమ సాగిన ఊరేగింపు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కాటమయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. గ్రామంపై ఎలాంటి ఆపదలు రాకుండా కాటమయ్య చల్లని చూపు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, గౌడ కులస్తులు మాట్లాడుతూ.. తమ పూర్వీకుల కాలం నుంచి కాటమయ్య బోనాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవం గ్రామస్తుల మధ్య ఐక్యతను, ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. భక్తుల కోలాహలం, డప్పు చప్పుళ్లు, బోనాల ఊరేగింపుతో నమిల గ్రామం శనివారం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.




# క్రీడల్లో రాణించాలి.. దేశ ఖ్యాతిని పెంచాలి

- రామన్నపేట డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు
- హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

**తొలివెలుగు, రామన్నపేట :** హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జీవితం ప్రతి ఒక్క విద్యార్థికి ఆదర్శప్రాయమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్ ఖానం అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కళాశాల వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రాహత్ ఖానం మాట్లాడుతూ.. హాకీ క్రీడ ద్వారా అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిన మహనీయుడు ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. విద్యార్థులు ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ దేశ ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ ఎం. రవీందర్ రావు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి

- ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సుద్దాల సాయికుమార్
- రామన్నపేటలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ




**తొలివెలుగు, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సుద్దాల సాయికుమార్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ శనివారం రామన్నపేట మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. యువతకు నాణ్యమైన విద్య, శాశ్వత ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రత కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే వార్షిక ఉద్యోగ క్యాలెండర్‌ను ప్రకటించి, ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కాంట్రాక్ట్, గిగ్ కార్మికులకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రతి జిల్లాలో ఉచిత శిక్షణ కేంద్రాలు, డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. యాదగిరిగుట్టలో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల్లో యువత, నిరుద్యోగులు, కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరు నరసింహ, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కళ్లెం స్వామి, కార్యదర్శి రచ్చ దయాకర్, నాయకులు మచ్చగిరి, ప్రవీణ్, రాజేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యపడవద్దు.. అండగా ఉంటా

- రామన్నపేట ఆస్పత్రిలో జ్వర బాధితులకు భరోసానిచ్చిన సర్పంచ్ సాయికుమార్



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న బోగారం గ్రామానికి చెందిన బాధితులను ఆ గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ శనివారం పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాపోలు దేవి, గండూరి వెంకటేశ్వర్లు, గండూరి యాదగిరిలను వ్యక్తిగతంగా కలసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు ధైర్యం చెబుతూ, అధైర్యపడవద్దని, త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తానని సర్పంచ్ సాయికుమార్ గౌడ్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అంతటి మల్లేష్, కూనూరు రాజు, గోగు సత్యనారాయణ యాదవ్, బద్దుల మహేష్ యాదవ్, కూనూరు మహేష్ గౌడ్, రాపోలు లక్ష్మీనారాయణ, కొక్కుల శంకర్, మేడి కృష్ణ, మేడి శ్రీరాములు, మేడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సైకి సన్మానం

**శాలువాతో సత్కరించిన ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇంజ మహేష్ మాదిగ**




**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలానికి బదిలీపై వచ్చిన నూతన ఎస్సై ఎండీ తక్యుద్దీన్‌ను ఎంఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఇంజ మహేష్ మాదిగ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై ఎండీ తక్యుద్దీన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. రాజాపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.

# ఆనందం ఆవిరి.. రాఖీ వేళ తీరని శోకం



- గోబర్ గ్యాస్ గుంత బలితీసుకున్న చిరుప్రాయం
- రెండేళ్ల బాలుడు ఆర్యన్ పండిట్ మృతి
- చిట్యాల మండలం ఏపూరిలో హృదయ విదారక ఘటన

**తొలివెలుగు, చిట్యాల :** సోదరుడికి రాఖీ కట్టేందుకు సంతోషంగా వచ్చిన ఓ మహిళ, అదే రోజు తన కన్న కొడుకును కోల్పోయి విషాదంలో మునిగిపోయింది. ఈ హృదయ విదారక ఘటన చిట్యాల మండలం ఏపూరి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కుమంతి కుమారి తన సోదరుడికి రాఖీ కట్టేందుకు భర్త అజయ్ పండిట్, రెండేళ్ల కుమారుడు ఆర్యన్ పండిట్‌తో కలిసి ఏపూరి గ్రామానికి వచ్చింది. ఆమె సోదరుడు ఏపూరి గ్రామ పరిధిలోని డీఈసీ కంపెనీలో పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో చిన్నారి ఆర్యన్ పండిట్ ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. కొంతసేపటికి బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు కంపెనీ ఆవరణలో తీవ్రంగా వెతికారు. ఈ క్రమంలో గోబర్ గ్యాస్ కోసం తీసిన గుంతలో బాలుడు మృతదేహంగా కనిపించాడు. కన్న కొడుకు మృతదేహాన్ని చూసిన తల్లి కుమంతి కుమారి ఆవేదనకు అంతులేకుండా పోయింది. రాఖీ పండుగ సందర్భంగా సోదరుడిని కలిసేందుకు వచ్చి, తిరిగి వెళ్లే సమయానికి తన కుమారుడిని కోల్పోవాల్సి రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న చిట్యాల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలుడి మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# టీఎంయూఎస్ నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రశాంత్

- ఎలికట్టెకు చెందిన ఉయ్యాల ప్రశాంత్ గౌడ్‌కు బాధ్యతలు
- ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్న నూతన అధ్యక్షుడు



**తొలివెలుగు, చిట్యాల :** తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం (టీఎంయూఎస్) నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చిట్యాల మండలం ఎలికట్టె గ్రామానికి చెందిన ఉయ్యాల ప్రశాంత్ గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోనూరు సంజయ్ దాస్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఉయ్యాల ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మలిదశ ఉద్యమకారులకు సరైన గుర్తింపు, గౌరవం దక్కేలా సంఘం తరఫున నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. గత టీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు మలిదశ ఉద్యమకారులను విస్మరించాయని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను ప్రభుత్వం గుర్తించి, వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మలిదశ ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు, ఆర్థిక భరోసా కల్పించి ఆదుకోవాలని కోరారు. తనపై నమ్మకం ఉంచి నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోనూరు సంజయ్ దాస్ గౌడ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలోని ఉద్యమకారులందరినీ ఐక్యం చేసి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉయ్యాల ప్రశాంత్ గౌడ్ పేర్కొన్నారు.

# తుక్కుగూడ ప్రైమ్ కేర్ హాస్పిటల్ లో నర్సు అనుమానాస్పద మృతి...!

**తుక్కుగూడలో నర్సు శిరీష మృతి - శరీరంపై గాయాలు, పోలీసుల దర్యాప్తు**

**శరీరంపై గాయాలతో మృతి -అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో విషాద ఘటన చోటుచేసుకుంది. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తున్న శిరీష (21) అనుమానాస్పద రీతిలో మృతి చెందింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చోటిగూడ గ్రామానికి చెందిన బ్రహ్మయ్య కుమార్తె శిరీష గత 8 నెలలుగా ఆ ఆస్పత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తోంది. శుక్రవారం ఆమె ఒంటిపై గాయాలతో మృతి చెంది ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు.

**పోలీసుల దర్యాప్తు ముమ్మరం..**

సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు,శంషాబాద్ డీసీపీ రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రి సిబ్బందిని విచారిస్తున్నారు. శిరీష మృతి వెనుక అసలు కారణం ఏమిటి అనేది పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని శంషాబాద్ డీసీపీ రాజేష్ తెలిపారు.

# క్రీడలతోనే సంపూర్ణ వికాసం

- గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో ఘనంగా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ డే
- విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన క్రీడా పోటీలు
- ప్రతిభ చాటిన చిన్నారులు.. సందడిగా మారిన పాఠశాల ప్రాంగణం
- చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: చైర్మన్ వీణ అనిల్‌రెడ్డి




**తొలివెలుగు, చౌటుప్పల్ :** విద్యార్థుల సంపూర్ణ వికాసానికి క్రీడలు అత్యంత కీలకమని గ్రీన్ గ్రోవ్ స్కూల్స్ చైర్మన్ బండి వీణ అనిల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్‌లోని గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో శనివారం ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలను విద్యార్థుల ఉత్సాహం, క్రీడా స్ఫూర్తి మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పరుగుపందేలు, రిలే రేసులు, వివిధ ఆటలు, వినోదాత్మక క్రీడా కార్యక్రమాల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారుల కేరింతలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించడంతో పాటు, పాల్గొన్న ప్రతి విద్యార్థిని నిర్వాహకులు ప్రత్యేకంగా ప్రోత్సహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే తత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ సాధిపల్లి లక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి




సరైన అవకాశాలు, ప్రోత్సాహం అందించడమే పాఠశాల లక్ష్యమని తెలిపారు. క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఏఓ మురళి మాట్లాడుతూ.. క్రీడా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్సాహం, స్నేహభావం, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని అన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ, విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పండుగల తేదీలు ఖరారు..!



- 4న కృష్ణాష్టమి.. 6న బోనాల పండుగ
- అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం
- ఆనవాయితికి భిన్నంగా బోనాల నిర్వహణపై భిన్నాభిప్రాయాలు

**తొలివెలుగు, చిట్యాల :** చిట్యాల పట్టణంలో నిర్వహించనున్న కృష్ణాష్టమి, బోనాల పండుగల తేదీలను ఖరారు చేశారు. వచ్చేనెల 4వ తేదీన కృష్ణాష్టమి వేడుకలు, 6వ తేదీన బోనాల పండుగను నిర్వహించాలని అఖిలపక్ష సమావేశంలో నిర్ణయించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అర్చకుల అభిప్రాయాలను తీసుకున్నారు. అనంతరం పండుగల నిర్వహణ తేదీలపై చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఈ సందర్భంగా పందిరి గీతా రమేష్ మాట్లాడుతూ.. పట్టణంలో జరిగే పండుగలను ఆధ్యాత్మిక, ప్రశాంత వాతావరణంలో ఐకమత్యంగా నిర్వహించుకోవాలని కోరారు. పండుగల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు.

**ఆనవాయితికి భిన్నంగా బోనాల నిర్వహణ..!**

చిట్యాల పట్టణంలో గత కొన్నేళ్లుగా బోనాల పండుగను గురువారం రోజున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఈసారి గురువారానికి బదులుగా ఆదివారం బోనాల పండుగను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంపై పట్టణ ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అఖిలపక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా, మరికొందరు ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని మార్చడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో బోనాల పండుగ తేదీ అంశం చిట్యాల పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కౌన్సిలర్లు ఏర్పుల పరమేష్, బొబ్బలి సందీప్ రామ్‌రెడ్డి, నాగిళ్ల సుధాకర్, కోనేటి ఎల్లయ్య, జేరిపోతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నల్లపోచమ్మ దేవి ద్వితీయ వార్షికోత్సవం



- భక్తిశ్రద్ధలతో మహాగణపతి పూజ, దైవ యజ్ఞం
- అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ పావని రమేష్ గౌడ్
- భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పురపాలక కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, మహాగణపతి పూజ, దైవ యజ్ఞం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కట్కూరి పాండురంగం గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణలు, పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా చౌటుప్పల్



మున్సిపల్ చైర్మన్ మొదుగుల పావని రమేష్ గౌడ్ ఆలయాన్ని సందర్శించి నల్లపోచమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులందరికీ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు మాటూరి రామకృష్ణ, బొడిగలింగం గౌడ్, గునిగంటి మల్లేష్ గౌడ్, కొయ్యడ నరసింహ గౌడ్, తండ రమేష్ గౌడ్, బొడిగ బాబు, తండ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడల్లో రాణించి దేశ ఖ్యాతిని పెంచాలి

- ట్రినిటీ పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం
- హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి
- రాష్ట్రస్థాయి లంగ్డీ పోటీల్లో సత్తా చాటిన ట్రినిటీ విద్యార్థులు
- జాతీయస్థాయికి శ్రీనిత, నిఖిల్ ఎంపిక

**తొలివెలుగు, చౌటుప్పల్ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉత్తమ ప్రతిభ కనబరచాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కెవిబి కృష్ణారావు అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కెవిబి కృష్ణారావు, పాఠశాల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కెవిబి కృష్ణారావు మాట్లాడుతూ.. భారత హాకీ క్రీడకు మేజర్ ధ్యాన్‌చంద్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన క్రీడా ప్రస్థానం ప్రతి విద్యార్థికి ఆదర్శమని, ఆయన క్రీడా స్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకుని యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొని తన ప్రతిభను మెరుగుపరచుకోవాలని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

**లంగ్డీలో ట్రినిటీ విద్యార్థుల సత్తా:**

ఇటీవల ఆగస్టు 22న హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పయనీర్ స్కూల్‌లో తెలంగాణ లంగ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి లంగ్డీ క్రీడా పోటీల్లో ట్రినిటీ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో ఎస్. శ్రీనిత, బాలుర విభాగంలో ఎం. నిఖిల్ తమ ప్రతిభతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయికి ఎంపికైన ఈ ఇద్దరు విద్యార్థులు త్వరలో కేరళలో నిర్వహించనున్న జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కెవిబి కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే క్రీడా స్ఫూర్తితో రాణించి పాఠశాలకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్కార్ చేతిలో ఆటబొమ్మలా మెట్రో నిర్వహణ

హైదరాబాద్ నగరవాసులకు మెట్రో రైళ్ల మొరాయింపుల నుంచి మోక్షం కలిగేలా లేదు. శనివార ఉదయం సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరీ ముఖ్యంగా ఆన్‌లైన్‌లో టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికులకు స్టేషన్ల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మెట్రో స్టేషన్లలోని ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద సెన్సార్లు పనిచేయక ప్రయాణికులు క్యూలో నిలిచిపోయారు. ఆన్‌లైన్‌లో ముందుగానే టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులు కూడా స్టేషన్‌లోకి అడుగుపెట్టలేకపోయారు. టికెట్లను స్కాన్ చేయాల్సిన సెన్సార్లలో వచ్చిన సాంకేతిక సమస్యలతో ఇన్‌గేట్, అవుట్ గేట్ల వద్ద ప్రయాణికులను నిలిచిపోయేలా చేసింది. శనివారం ఉదయం నుంచే పలు స్టేషన్లలో సాంకేతిక సమస్యలు వచ్చినట్లుగా తెలిసింది. అయితే పీక్ అవర్స్ నాటికి ఈ సమస్య తీవ్రత పెరిగినట్లుగా సమాచారం. దీంతో ఆఫీసులు, స్కూళ్లు, విద్యాసంస్థలకు వెళ్లేవారు మెట్రో స్టేషన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలతో గంటకు పైగా ఎదురుచూడాల్సినపరిస్థితి వచ్చింది. సెన్సార్లు పనిచేయకపోవడంతో ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో స్టేషన్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించే వీల్లేక ప్రయాణికులు మరింత అసంతృప్తికి గురయ్యారు. దాదాపు 12 స్టేషన్లలో ఈ సమస్య వచ్చినట్లుగా తెలిసింది. కానీ మెట్రో యంత్రాంగం ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెల్లడించలేదు. అదే విధంగా కారణాలను కూడా పేర్కొనలేదు. సర్కారు పూర్తి పర్యవేక్షణలోకి రాక ముందే మెట్రో నిర్వహణ అధ్వాన్నంగా మారితే... ఇక ప్రభుత్వ పర్యవేక్షణలో మెట్రో ప్రయాణం ఊహించలేమని ఇప్పుడే ప్రయాణికులు భయపడిపోతున్నారు. టికెట్లు కొనుగోలు చేసి కూడా గంటల తరబడి గేట్ల వద్ద ఎదురుచూడాలంటే చాలా ఇబ్బందిగా, కీలకమైన సమయం వృథా అవుతుందనీ వాపోతున్నారు. ఆధునాతన సాంకేతికత సాయంతో పనిచేయాల్సిన మెట్రోలో ఇలా తరుచుగా వచ్చే సమస్యలకు ప్రధాన కారణం నిర్వహణ పడకేయడమేనని ప్రయాణికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో వచ్చే సమస్యలతో మెట్రో ప్రయాణమే భయపడాల్సి వస్తుందనీ, ఎప్పుడూ, ఎక్కడ అగిపోతుందోననే అనుమానం, గమ్యస్థానాలకు చేరేంత వరకు నమ్మకం లేని ప్రయాణంగా మారిపోతుందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలీ చాలనీ బోగీలతో నెట్టుకొస్తున్న మెట్రో సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించడంలో విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో పర్యవేక్షణ చేయాల్సిన హెచ్ఎంఆర్ఎల్ యంత్రాంగం పట్టించుకోలేదు. కనీసం మెట్రో సేవల్లో అంతరాయానికి గల కారణాలను అన్వేషించనీ అధికారులు... భూసేకరణ పూర్తి కానీ ఓల్డ్ సిటీ మెట్రో కారిడార్‌లో పర్యటించి హడావుడి చేశారని ప్రయాణికులు మండిపడ్డారు. మెట్రో రైలు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ అజిత్ రెడ్డి, అధికారులతో కలిసి ఓల్డ్ సిటీ భూసేకరణ పర్యవేక్షించారే తప్పా... మెట్రో రైలులో తరుచుగా వచ్చే సాంకేతిక సమస్యలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదనీ ప్రయాణికులు మండిపడుతున్నారు.



# మాతృభాషే మన అస్తిత్వానికి ప్రతీక





- గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- గిడుగు వెంకట రామమూర్తి సేవలకు ఘన నివాళి
- తెలుగు భాషా వైభవాన్ని చాటిన విద్యార్థుల కార్యక్రమాలు
- మాతృభాషను భావితరాలకు అందించాలి: చైర్మన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్ :** మాతృభాష మన భావాలను వ్యక్తపరిచే సాధనం మాత్రమే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయం, అస్తిత్వానికి ప్రతీక అని గ్రీన్ గ్రోవ్ స్కూల్స్ చైర్మన్ బండి వీణ అనిల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్‌లోని గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనం, తెలుగు సాహిత్య వైభవాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషా వికాసానికి విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు సేవలను స్మరించుకుని ఘనంగా నివాళులర్పించారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే వ్యావహారిక భాషను ప్రోత్సహించడంలో గిడుగు రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా చైర్మన్ బండి వీణ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. "మాతృభాష మన భావాలను వ్యక్తపరిచే సాధనం మాత్రమే కాదు.. మన సంస్కృతి, సంప్రదాయం, మన అస్తిత్వానికి ప్రతీక" అని అన్నారు. తెలుగు భాషను పరిరక్షించి, భావితరాలకు మరింత బలంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ సాధిపల్లి లక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ మాతృభాషపై గౌరవం, అభిమానం పెంపొందించుకోవాలని సూచించారు. తెలుగు సాహిత్యం, పద్యాలు, కథలు, రచనలను చదవడం ద్వారా భాషపై ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. ఏఓ మురళి మాట్లాడుతూ.. తెలుగు భాషా వికాసానికి కృషి చేసిన మహనీయుల సేవలను విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. గిడుగు వెంకట రామమూర్తి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**తెలుగు వైభవాన్ని చాటిన చిన్నారులు:**

కార్యక్రమంలో విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని చాటిచెప్పే ప్రసంగాలు, కవితలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య వైభవాన్ని ప్రతిబింబించేలా చిన్నారులు ప్రదర్శించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలుగు భాషా దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# దుమ్ముతో దడ... శ్వాస తీసుకోలేని స్థితి!

- వాహనం వెళ్తే దుమ్ము మేఘమే..!
- చిరు వ్యాపారాలకు దెబ్బ.. ప్రజలకు తప్పని అవస్థలు
- కళ్లలో మంట, గొంతులో ఇబ్బందులతో స్థానికుల ఆవేదన
- రోడ్డుపై నీళ్లు చల్లి దుమ్ము నియంత్రించాలని డిమాండ్




చిలుక మనోహర్, కూరగాయల వ్యాపారి

**తొలివెలుగు, జన్నారం:** జన్నారం మండలం పొనకల్ ప్రధాన రహదారిపై దుమ్ము సమస్య రోజురోజుకూ తీవ్రంగా మారుతోంది. నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రహదారిపై పెద్ద ఎత్తున దుమ్ము ఎగసిపడుతోంది. వాహనం వెళ్లిన ప్రతిసారీ దుమ్ము మేఘంలా కమ్ముకుంటుండటంతో స్థానికులు, పాదచారులు, వాహనదారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుమ్ము ధాటికి శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వాహనం వెళ్తే దుమ్ము మేఘమే!**

పొనకల్ ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనం రహదారిపై నుంచి వెళ్లిన ప్రతిసారీ పెద్ద ఎత్తున దుమ్ము పైకి లేస్తోంది. దీంతో కొంతదూరం వరకు పరిసర ప్రాంతమంతా ధూళితో కమ్ముకుంటోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు సైతం స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాల భయం నెలకొంటోందని పలువురు చెబుతున్నారు.

**చిరు వ్యాపారాలకు దుమ్ము దెబ్బ:**

ప్రధాన రహదారి వెంట కూరగాయలు, పండ్లు, కిరాణా, టీ, టిఫిన్ తదితర చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి దుమ్ము సమస్య పెద్ద తలనొప్పిగా మారింది. దుకాణాలు తెరిచిన కొద్దిసేపటికే దుమ్ము పేరుకుపోతుండటంతో వ్యాపారులు పదేపదే శుభ్రం చేసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా ఆహార పదార్థాలు, కూరగాయలపై దుమ్ము పడుతుండటంతో వాటిని రక్షించుకోవడం కష్టంగా మారిందని వ్యాపారులు వాపోతున్నారు.

**ప్రజలకు తప్పని అవస్థలు:**

పొనకల్ ప్రధాన రహదారి మీదుగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కూలీలు, వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దుమ్ము కారణంగా కళ్లలో మంట, గొంతులో ఇబ్బంది, దగ్గు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు ముఖానికి మాస్కులు, కర్చీఫ్‌లు కప్పుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నీళ్లు చల్లి ఉపశమనం కల్పించాలి:**

దుమ్ము సమస్య నుంచి తక్షణ ఉపశమనం కల్పించేందుకు ప్రధాన రహదారిపై తరచూ నీటిని చల్లాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రహదారిపై పేరుకుపోయిన మట్టి, ధూళిని తొలగించి శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు రహదారి పరిస్థితిని పరిశీలించి దుమ్ము నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**శాశ్వత పరిష్కారం చూపాలి:**

తాత్కాలికంగా నీటిని చల్లడంతో సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించదని స్థానికులు పేర్కొంటున్నారు. రహదారి పరిస్థితిని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు దుమ్ము సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇకనైనా స్పందించాలని కోరుతున్నారు.

## స్థానికుల ఆవేదన

**చిలుక మనోహర్, కూరగాయల వ్యాపారి**



"దుమ్ము కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రహదారి పక్కనే కూరగాయల వ్యాపారం చేస్తున్నాం. వాహనాలు వెళ్లినప్పుడల్లా దుమ్ము కూరగాయలపై పడుతోంది. రోజంతా దుమ్ముతోనే అవస్థలు పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి రహదారిపై నీళ్లు చల్లేలా చర్యలు తీసుకోవాలి."

**కానగంటి దేవయ్య:**



"ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వాహనాలు వెళ్లిన ప్రతిసారీ దుమ్ము కళ్లలో, ముఖంపై పడుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కూడా సరిగ్గా కనిపించక ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది. అధికారులు వెంటనే స్పందించి దుమ్ము సమస్యను నివారించాలి."

పొనకల్ ప్రధాన రహదారిపై దుమ్ము సమస్యతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# వికలాంగుల పేరుతో అధిక వడ్డీ దందా..!?

వికలాంగుల పేరును ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు అమాయక ప్రజలు, ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నారంటూ పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. మాడ్గుల మండలంలో బెట్టింగ్‌కు అలవాటు పడిన కొందరు యువకులతో సన్నిహితంగా ఉంటూ, వారి అత్యవసర ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అప్పులు ఇచ్చి భారీగా వడ్డీలు వసూలు చేస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. కొందరు వ్యక్తులు రూ.10 వడ్డీ పేరుతో అప్పులు ఇచ్చి, కాలక్రమేణా అసలు కంటే వడ్డీ భారం ఎక్కువయ్యేలా వసూళ్లు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వడ్డీ చెల్లించలేని పరిస్థితుల్లో అప్పు తీసుకున్న యువకులు మరింత అప్పులు చేయాల్సి వస్తోందని, దీంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డీ వసూళ్లపై ప్రశ్నించినా, తమకు రావాల్సిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా.. తమకు యూనియన్ అండగా ఉందని, ఇబ్బందులకు గురిచేస్తామని కొందరు హెచ్చరిస్తున్నారంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై అధికారికంగా విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. మాడ్గుల మండలంలో ఎటువంటి లైసెన్స్ లేకున్నా అధిక వడ్డీల వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా అధిక వడ్డీలు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ముఖ్యంగా బెట్టింగ్ వంటి వ్యసనాలకు గురవుతున్న యువతను అధిక వడ్డీ అప్పుల బారిన పడకుండా కాపాడేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# పసిడి, వెండి రివర్స్‌గేర్

న్యూఢిల్లీ: అమెరికా--ఇరాన్ మధ్య యుద్ధానికి రెండు వారాల విరామంపై అంగీకారంతో ర్యాలీ చేసిన పసిడి, వెండి ఒక్క రోజు తిరగకుండానే గురువారం అమ్మకాల ఒత్తిడికి నష్టపోయాయి. కాల్పుల విరమణకు విరుద్ధంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసిందంటూ, ఒప్పందం నుంచి తప్పుకుంటామని ఇరాన్ చేసిన హెచ్చరికలు, హార్మూజ్‌ను మూసేసిందన్న వార్తలతో ముడి చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. ఈ ప్రభావంతో ఢిల్లీ మార్కెట్లో వెండి కిలోకి ఏకంగా రూ.7,800 నష్టపోయి రూ.2.43 లక్షలకు దిగొచి?చంది. అటు బంగారం 10 గ్రాములకు రూ.1,500 తగ్గి రూ.1,54,900 స్థాయికి పరిమితమైంది. 'పశి?చమాసియాలో కాల్పుల విరమణపై ఏర్పడ్డ సందేహాలతో బంగారం, వెండి ముందటి రోజు లాభపడిన స్థాయిలో నష్టపోయాయి. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంపై అనిశ?చతులు నెలకొనడం, ట్యాంకర్లు నిలిచిపోయాయన్న సమాచారం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపించింది.దీంతో ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న ఆందోళనలు తిరిగి నెలకొన్నాయి' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 12 డాలర్లు పెరిగి 4,789 డాలర్ల వద్ద ఉంటే, వెండి 0.74 డాలర్ల నష్టంతో 74.83 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

# ఒక వైపు 30వేల లేఆఫ్స్.. మరోవైపు రూ.270 కోట్ల ఆఫర్!



ప్రముఖ టెక్ దిగ్గజం 'ఒరాకిల్' ఇటీవల ప్రపంచవ్యాప్తంగా సుమారు 30,000 మంది ఉద్యోగులను తొలగించి వార్తల్లో నిలిచింది. ఇలాంటి సమయంలో కంపెనీ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (జఖీూ)గా హిలరీ మ్యాక్సన్‌ను భారీ వేతనంతో నియమించింది. సంస్థ తీసుకున్న ఈ నిర్ణయం సర్వత్రా చర్చకు దారితీసింది. ఒరాకిల్ కొత్త సీఎఫ్ఓ హిలరీ మ్యాక్సన్‌కు కంపెనీ 9,50,000 డాలర్ల జీతం ఇవ్వనుంది. అదనంగా పనితీరు ఆధారంగా 2.5 మిలియన్ డాలర్ల వరకు బోనస్ పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా 26 మిలియన్ డాలర్ల విలువైన ఈక్విటీ (షేర్లు) కూడా సంస్థ అందిస్తుంది. వీటిలో 80 శాతం సమయానికి అనుసంధానమైనవి కాగా, 20 శాతం పనితీరుపై ఆధారపడి ఉంటాయి.మ్యాక్సన్ తన ఈక్విటీని పూర్తిగా స్టాక్ ఆప్షన్ల రూపంలో లేదా స్టాక్ ఆప్షన్లు, రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్ల రూపంలో తీసుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా కంపెనీ ఆమెకు 2,50,000 విలువైన రీలోకేషన్ అలవెన్స్ కూడా అందిస్తోంది. ఇవన్నీ కలిగి ఆమె మొత్తం ప్యాకేజీ సుమారు 29.7 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.273 కోట్లు) చేరుకుంటుంది.హిలరీ మ్యాక్సన్ ఒరాకిల్‌లో చేరడానికి ముందు.. ష్నైడర్ ఎలక్ట్రిక్‌లో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ సీఎఫ్ఓగా పనిచేశారు. అంతే కాకుండా ఆమె ఏఈఎస్ కార్పొరేషన్‌లో 12 సంవత్సరాలు పాటు ఫైనాన్స్, స్ట్రాటజీ మొదలైన విభాగాల్లో పాటు కీలక బాధ్యతలు నిర్వహించారు.

**కంపెనీ భారీ లేఆఫ్స్**

ఇటీవల ఒరాకిల్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 30,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ భారీ లేఆఫ్ ప్రభావం భారతదేశంలో సుమారు 12,000 మంది ఉద్యోగులపై పడింది. కంపెనీ ఉద్యోగులను తొలగించడానికి ప్రధాన కారణం.. కంపెనీ నిర్మాణ మార్పులు, ఖర్చు తగ్గింపు చర్యలు, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అని తెలుస్తోంది. ఈ కోతలు ఒరాకిల్ హెల్త్, సేల్స్, క్లౌడ్, కస్టమర్ సక్సెస్, నెట్‌సూట్‌లోని సిబ్బందిని ప్రభావితం చేసినట్లు సమాచారం.


# డిస్నీలో లేఆఫ్స్?

## 1,000 మంది ఉద్యోగులపై వేటు

ప్రపంచ వినోద రంగ దిగ్గజం 'వాల్ట్ డిస్నీ' తన ఖర్చులను తగ్గించుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా రాబోయే కొద్ది వారాల్లో సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించాలని కంపెనీ యోచిస్తోంది. ప్రధానంగా కంపెనీలోని మార్కెటింగ్ విభాగంపై ఈ ప్రభావం అధికంగా ఉండనుందని వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది.డిస్నీలో జరుగుతున్న ఈ తాజా పరిణామాలు సంస్థ అంతర్గత పునర్‌వ్యవస్థీకరణలో భాగమని తెలుస్తోంది. కొత్తగా నియమితులైన చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ (సీఎంఓ) అసద్ అయాజ్ కంపెనీ మార్కెటింగ్ గ్రూపును ఏకీకృతం చేసే పనిలో ఉన్నారు. 'ప్రాజెక్ట్ ఇమాజిన్' అనే రహస్య కోడ్ పేరుతో వ్యయ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. జనవరిలో బాధ్యతలు చేపట్టిన అయాజ్ సంస్థలోని అన్ని మార్కెటింగ్ కార్యకలాపాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని భావిస్తున్నారు.కొత్త చేపట్టబోయే లేఆఫ్స్ డిస్నీ మొత్తం శ్రామిక శక్తిలో 1 శాతం కంటే తక్కువే. 2025 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి డిస్నీలో సుమారు 2,31,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. జోష్ డి అమారో డిస్నీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు స్వీకరించక ముందే ఈ ఉద్యోగాల తగ్గింపు ప్రణాళికలు సిద్ధమైనట్లు సమాచారం.

# వాణిజ్యలోటు కలవరం.. జూలై నెలలో 31.98 బిలియన్ డాలర్లు

ఆరు నెలల గరిష్ఠానికి చేరుకున్న లోటు




న్యూఢిల్లీ, ఆగస్టు 13 : దేశీయ ఎగుమతులు భారీగా పుంజుకుంటున్నాయి. గత నెలలో 44.24 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యాయి. కిందటేడాది ఇదే నెలలో అయిన ఎగుమతులతో పోలిస్తే 19.6 శాతం చొప్పున పెరిగాయి. ఇదే సమయంలో భారత్ 76.22 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 17.52 శాతం అధికమయ్యాయి. దీంతో వాణిజ్యలోటు (ఎగుమతులు-దిగుమతుల మధ్య వ్యత్యాసం) ఆరు నెలల గరిష్ఠ స్థాయిని తాకింది. గత నెలలో వాణిజ్యలోటు 31.98 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. పెట్రోలియం ఉత్పత్తులు అధికంగా దిగుమతి చేసుకోవడం వల్లనే వాణిజ్యలోటు పెరిగిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఒక జూలై నెలలోనే 18.31 బిలియన్ డాలర్ల విలువైన క్రూడాయిల్‌ను భారత్ దిగుమతి చేసుకున్నది. కిందటేడాదితో పోలిస్తే ఇది 17.64 శాతం అధికం. అతి విలువైన లోహాల దిగుమతులను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచడంతో వీటి దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. గత నెలలో పసిడి దిగుమతులు కేవలం 4.77 శాతం పెరిగి 4.16 బిలియన్ డాలర్లకు చేరుకోగా, వెండి దిగుమతులు 66 శాతం తగ్గి 171.68 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మే 13 నుంచి అమల్లోకి వచ్చేలా ఈ రెండు లోహాలపై సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు గోల్డ్ దిగుమతులు 32.41 శాతం ఎగబాకి 15.17 బిలియన్ డాలర్లకు చేరుకోగా, వెండి దిగుమతులు 50.81 శాతం తగ్గి 718.42 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దేశంలోకి వస్తున్న బంగారంలో 40 శాతం స్విట్జర్లాండ్ నుంచి దిగుమతి అవుతున్నదని, అలాగే యూఏఈ నుంచి 16 శాతం, దక్షిణాఫ్రికా నుంచి 10 శాతం చొప్పున వస్తున్నది. జూలై నెలలో స్విట్జర్లాండ్ నుంచి 2 బిలియన్ డాలర్ల విలువైన పసిడి దిగుమతి అయింది. చైనా తర్వాత అత్యధికంగా బంగారం వినియోగిస్తున్న భారత్‌లో ఆభరణాలకు ఎనలేని డిమాండ్ ఉన్నది.

**పశ్చిమాసియా దేశాలకు ఎగుమతుల్లో వృద్ధి**

పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ ఎగుమతులపై ఎలాంటి ప్రభావం చూపలేదు. గత నెలలో పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి 5.7 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. కిందటేడాది ఇదే నెలలో అయిన ఎగుమతులతో పోలిస్తే ఇది 8.62 శాతం అధికం. ప్రధానంగా పెట్రోలియం, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 67 శాతం అధికమయ్యాయని రాజేశ్ అగర్వాల్ తెలిపారు. యూఏఈకి 10 శాతం పెరుగగా, సౌదీ అరేబియాకు 2.73 శాతం తగ్గాయి.

**క్రూడాయిల్ ధరలు పెరుగడం వల్లనే..**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గత నెలలో బ్యారెల్ క్రూడాయిల్ ధరలు 72 డాలర్ల నుంచి 95 డాలర్లకు చేరుకోవడంతో భారత్ అధికంగా చెల్లించాల్సి వచ్చింది. దీంతో వాణిజ్యలోటు ఆరు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకోవడానికి యుద్ధమే కారణమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మొత్తం దిగుమతుల్లో క్రూడాయిల్ వాటా 24 శాతంగా ఉండటం ఇందుకు కారణం. ఇదే సమయంలో ఎగుమతులు కూడా భారీగా పుంజుకున్నాయి. జూన్ 2022 తర్వాత ఒక నెలలో ఇంతటి స్థాయిలో ఎగుమతులు జరుగడం ఇదే తొలిసారి కావడం విశేషం. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల్లో ఎగుమతులు 17 శాతం ఎగబాకి 173.78 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 19 శాతం అధికమై 292.38 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇదే సమయంలో వాణిజ్యలోటు 118.60 బిలియన్ డాలర్లు. ముడి పత్తి, పప్పుదినుసులు, ఎరువులు, బొగ్గు, కోక్, కెమికల్స్, ప్రాజెక్ట్ గూడ్స్, గోల్డ్, ఎలక్ట్రానిక్ వస్తువులను భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకున్నది. ఈ సందర్భంగా వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ..పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్, సముద్రపు ఉత్పత్తుల ఎగుమతులు పెరుగడం శుభసూచకమన్నారు.

# ఎగుమతులు డీలా.. గల్ఫ్ సంక్షోభం దెబ్బకు 2-3% పడిపోవచ్చు



**భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య అంచనా**

లుధియానా, : దేశీయ వస్తూత్పత్తి ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 2-3 శాతం క్షీణించవచ్చని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) అంచనా వేస్తున్నది. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో అంతర్జాతీయంగా ఏర్పడిన అనిశ్చిత పరిస్థితులు ఇందుకు కారణమని ఎఫ్ఐఈవో అధ్యక్షుడు ఎస్‌సీ రల్హాన్ గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. గత నెల మార్చి ఎగుమతుల్లో 7-8 శాతం పతనం చూసే వీలుందన్నారు. ఈ నెల 15న కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ 2025-26కు సంబంధించి దేశీయ ఎగుమతి-దిగుమతి గణాంకాలను వెల్లడించనున్న నేపథ్యంలో ఎఫ్ఐఈవో అంచనాలు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేయడంతో యుద్ధం మొదలైన విషయం తెలిసిందే.అప్పట్నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతుల్లో అంతరాయం కలుగుతున్నది. అంతేగాక నౌకలు, విమానాల్లో సరుకు రవాణా ఖర్చులు పెరుగడం, బీమా ఖరీదెక్కడం జరిగిపోయాయి. కీలకమైన హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేయడం.. సముద్ర రవాణాకు ఇబ్బందుల్ని తెచ్చిపెట్టింది. అలాగే అమెరికా-ఇజ్రాయెల్‌కు అండగా ఉంటున్నారని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులకు దిగడంతో ఆయా దేశాలు తమ గగనతలాలపై ఆంక్షల్ని తీసుకురావడం.. విమానాల్లో సరుకు రవాణా వ్యయాన్ని పెంచేసింది. ఇక దేశీయ ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా, మెజారిటీ వాటా సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రెయిన్ తదితర దేశాలదే. అయితే ఈ దేశాల్లోని ముడి చమురు, సహజ వాయువు ఉత్పాదక కేంద్రాలే లక్ష్యంగా ఇరాన్ క్షిపణులను ప్రయోగిస్తుండటంతో ఉత్పత్తి ఆగిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగిపోయాయి. ఫలితంగా ఉక్కు, ప్లాస్టిక్, రబ్బర్ తదితర ముడి సరుకుల ధరలూ పెరిగాయని, ఇవన్నీ కూడా అంతిమంగా ఎగుమతుల్నే ప్రభావితం చేస్తున్నాయని రల్హాన్ వివరించారు. అయితే దేశీయ వస్తూత్పత్తి, సేవల ఎగుమతుల్ని కలిసి చూసినైట్టెతే గత ఆర్థిక సంవత్సరం 5-6 శాతం పెరుగుదల కనిపించవచ్చని చెప్పారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఎగుమతులు 825 బిలియన్ డాలర్లు (వస్తూత్పత్తి ఎగుమతులు 437 బిలియన్ డాలర్లు, సేవల ఎగుమతులు 388 బిలియన్ డాలర్లు)గా ఉన్నాయి. కాగా, అమెరికా-ఇరాన్ మధ్య 2 వారాల కాల్పుల విరమణ సంధితో నౌకల్లో సరుకు రవాణా తిరిగి ప్రారంభం కాగలదన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా రల్హాన్ వ్యక్తం చేశారు. అయితే అధిక వడ్డీరేట్లు ఎగుమతిదారులకున్న రుణ లభ్యత అవకాశాలను దెబ్బతీస్తున్నాయని, ప్రభుత్వం ఈ విషయంలో ఊరట కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. 2024-25లో గల్ఫ్ దేశాలతో భారత్ ద్వైపాక్షిక వాణిజ్యం 178 బిలియన్ డాలర్లు (రూ.16.55 లక్షల కోట్లు). ఎగుమతులు 56.87 బిలియన్ డాలర్లు, దిగుమతులు 121.67 బిలియన్ డాలర్లు.

భారత్ నుంచి యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్, బహ్రెయిన్, ఖతార్, కువైట్ (గల్ఫ్ రీజియన్) దేశాలకు సానబెట్టిన రత్నాలు, ఆభరణాలు, బియ్యం, ఔషధాలు ఎక్కువగా ఎగుమతి.

గల్ఫ్ ఉద్రిక్తతల ఒత్తిడిలో భారతీయ పెట్రోలియం ఉత్పత్తులు, రసాయనాలు, ప్లాస్టిక్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, వ్యవసాయం, ఔషధ, రత్నాలు, ఆభరణాల ఇండస్ట్రీలు.

గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) నుంచి ముడి చమురు, ద్రవరూప సహజ వాయువు (ఎల్ఎన్‌జీ), పెట్రో కెమికల్స్ భారత్‌కు ఎక్కువగా దిగుమతి. సౌదీ అరేబియా వాటానే అధికం.



## బాలీవుడ్ ఎంట్రీపై భాగ్యశ్రీ బోర్సేకు షాక్..

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. ‘మర్జావాన్’, ‘ఏక్ దివానే కీ దివానియత్’ వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు.



## ‘స్పిరిట్’ నుంచి దీపికా ఔట్..

పాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, ట్రెండ్ సెట్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న చిత్రం ‘స్పిరిట్’ (రాజూఅతీఖ్). ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే ఈ చిత్రంలో ముందుగా హీరోయిన్‌గా ఫిక్స్ అయిన బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొనే తర్వాత తప్పుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్ట్ నుంచి దీపికా ఎందుకు తప్పుకున్నారు అనే విషయంపై గతంలో రకరకాల ఊహాగానాలు వినిపించాయి. తాజాగా ఈ వివాదంపై దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సోదరుడు, నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇస్తూ సంచలన విషయాలను బయటపెట్టారు. ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దాదాపు ఒకటిన్నర సంవత్సరాలుగా దీపికాతో టచ్‌లో ఉన్నారని, ఆమె ప్రతిభ మీద నమ్మకంతోనే లీడ్ రోల్ కోసం సంప్రదించామని ప్రణయ్ వెల్లడించారు. అయితే ఆ టైమ్‌లో ఆమె నటించిన సినిమాలు బ్లాక్‌బస్టర్స్ కావడంతో ఆమె డిమాండ్లు పూర్తిగా మారిపోయాయని ఆయన తెలిపారు. కేవలం భారీ రెమ్యూనరేషనే కాకుండా, ఏకంగా సినిమా నికర లాభాల్లో 10 శాతం వాటా (ాతీశీటఱ్ రాష్ట్రుతీవ) కావాలని ఆమె పట్టుబట్టారని ప్రణయ్ స్పష్టం చేశారు. అంతేకాకుండా కేవలం ఆర్థికాంశాలే కాకుండా, షూటింగ్ కాల్షీట్లు మరియు ప్రొఫెషనల్ పని గంటల విషయంలోనూ ఆమె పెట్టిన కొన్ని కండిషన్స్ చిత్ర యూనిట్‌కు పొసగలేదని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్ట్ తమకు వర్కవుట్ కాదని భావించి పక్కన పెట్టాలని నిర్ణయించుకున్న తరుణంలో, సినిమా కథకు సంబంధించిన కొన్ని అత్యంత గోప్యమైన ఇంటర్నల్ విషయాలను ఆమె పీఆర్ (ూ=) టీమ్ ద్వారా బయటకు లీక్ చేయించారని ప్రణయ్ తీవ్రంగా ఆరోపించారు. ఇలా దర్శకుడు ముందస్తుగా నమ్మి చర్చించిన విషయాలు బహిర్గతం కావడం వల్ల సందీప్ రెడ్డి వంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యారని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆమెను ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నుంచి తప్పించి, ఆ తర్వాతే నూతన నాయిక త్రిప్తి డిమ్రీ (Triptii Dimri) ని ఖరారు చేసినట్లు ప్రణయ్ వివరించారు.



## వరస ఫ్లాప్స్.. తెలుగు హీరో షాకింగ్ నిర్ణయం



ఒకప్పుడు కాస్త అటుఇటుగా ఉన్నాసరే సినిమాలు ఆడేసేవి. ఇప్పుడలా అస్సలు లేదు. ఏ మాత్రం కంటెంట్ తేడాగా ఉన్నాసరే తొలి ఆట నుంచి డిజాస్టర్ టాక్ లేదంటే విపరీతమైన ట్రోలింగ్ గ్యారంటీ. దీంతో యువ హీరోలకు ఏం చేయలో దిక్కుతోచట్లేదు. పలువురి దర్శకులు చెబుతున్న స్టోరీలో వింటున్నప్పటికీ పెద్దగా నమ్మకం కుదరట్లేదే ఏమో గానీ షాకింగ్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పుడా లిస్టులోకి మహేశ్ బాబు బావమరిది, హీరో సుధీర్ బాబు కూడా చేరినట్లు కనిపిస్తున్నాడు.2012లో ‘శివ మనసులో శృతి’ సినిమాతో హీరోగా కెరీర్ ప్రారంభించిన సుధీర్ బాబు.. ఇప్పటివరకు 20కి పైగా మూవీస్ చేశాడు. వీటిలో ప్రేమకథా చిత్రం, సమ్మోహనం తప్పితే చెప్పుకోదగ్గవి పెద్దగా లేవు. గతేడాది ‘జటాధర’ అంటూ పాన్ ఇండియా ప్రయత్నాలు చేశాడు గానీ ఘోరంగా బెడిసికొట్టింది. అప్పటినుంచి డైలామాలో పడిపోయిన సుధీర్ బాబు.. ఇప్పుడు తానే దర్శకుడు అవ్వాలని నిర్ణయించుకున్నాడట.కొన్నిరోజుల క్రితం హీరో రామ్ ఎలా అయితే తనే కథ రాసుకుని, హీరో కమ్ దర్శకుడు అయ్యాడో ఇ?ప్పుడు అదే దారిలోకి సుధీర్ బాబు కూడా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. కథ రాసుకుని హీరోగా నటించి దర్శకుడిగానూ మారే ప్రయత్నాలు సుధీర్ బాబు ఉన్నాడట. త్వరలో ఈ విషయమై ప్రకటన రానుందని టాక్.సుధీర్ బాబు, రామ్ అనే కాదు విశ్వక్ సేన్, కిరణ్ అబ్బవరం లాంటి యువహీరోలు కూడా తామే స్టోరీ రాసుకుని దర్శకులుగా మారిపోయారు. సిద్ధు జొన్నలగడ్డ, అడివి శేష్, నవీన్ పొలిశెట్టి లాంటి హీరోలైతే డైరెక్షన్ తప్పితే దాదాపు అన్ని పనులు చేస్తున్నారు.



## చరణ్, ఎన్టీఆర్ కూడా మల్టీప్లెక్స్ బిజినెస్‌లోకి?

తెలుగు స్టార్ హీరోలు ఓవైపు సినిమాలు చేస్తున్నప్పటికీ మరోవైపు బిజినెస్‌ల్లోకి కూడా ఎంట్రీ ఇస్తున్నారు. మిగతా వ్యాపారాల సంగతేమో గానీ మహేశ్ బాబు, అల్లు అర్జున్, రవితేజ, విజయ్ దేవరకొండ.. ఇప్పటికే మల్టీప్లెక్స్ బిజినెస్‌లోకి ?అడుగుపెట్టేశారు. అవి విజయవంతంగా సాగుతున్నాయి కూడా. ఇప్పుడు వీళ్లకు పోటీగా రామ్ చరణ్, ఎన్టీఆర్ కూడా ఇదే వ్యాపారంలోకి రాబోతున్నారని సోషల్ మీడియాలో తెగ మాట్లాడుకుంటున్నారు. హైదరాబాద్‌లో మహేశ్ బాబుతో ఏఎమ్‌బీ, ?అల్లు అర్జున్‌తో ఏఏఏ, రవితేజతో ఏఆర్‌టీ మల్టీప్లెక్స్‌ల్లో భాగస్వామి అయిన ఆసియన్ సినిమాస్ సంస్థతో రామ్ చరణ్ కూడా జట్టుకట్టారని.. త్వరలోనే ఏఆర్‌సీ పేరుతో హైదరాబాద్‌లోనే ఓ మల్టీప్లెక్స్ నిర్మించే ఆలోచనలో ఉన్నారని టాక్. మరోవైపు ఎన్టీఆర్.. సొంతంగా గచ్చిబౌలిలో ప్రీమియం మల్టీప్లెక్స్ కట్టే ఆలోచనలో ఉన్నాడని ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అంటున్నారు. మరి ఈ ఇద్దరి హీరోలు, థియేటర్ బిజినెస్‌లోకి ఎంట్రీ ఇచ్చే విషయమై గట్టిగానే పుకార్లు వినిపిస్తున్నప్పటికీ ఇందులో నిజానిజాల సంగతి ఏంటనేది తెలియాల్సి ఉంది. ఒకవేళ ఇదే నిజమైతే మాత్రం టాలీవుడ్ సినిమాల పరంగానే కాదు మల్టీప్లెక్స్‌ల పరంగా పోటీ పడుతున్నట్లు అవుతుంది.



## మొన్న ధనుష్.. ఇప్పుడు భారత క్రికెటర్‌తో రూమర్స్?

తెలుగులో మూడు నాలుగు సినిమాలే చేసినప్పటికీ హీరోయిన్ మృణాల్ ఠాకుర్‌ని ఇక్కడి ప్రేక్షకులు, మరీ ముఖ్యంగా యూత్ బాగానే ఓన్ చేసుకున్నారు. అందుకు తగ్గట్లే ఎప్పటికప్పుడు ఏదోలా మృణాల్ వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. కొన్నిరోజుల క్రితం హీరో ధనుష్‌తో డేటింగ్, పెళ్లి అని తెగ మాట్లాడుకున్నారు. కట్ చేస్తే ఇప్పుడు టీమిండియా స్టార్ క్రికెటర్ పంత్‌తో డేటింగ్‌లో ఉందంటున్నారు. దానికి కారణాలు కూడా చెబుతున్నారు. మృణాల్ ప్రస్తుతం హిందీలో వరసగా సినిమాలు చేస్తోంది. కొన్నిరోజుల క్రితం హీరో ధనుష్‌తో ఈమె రిలేషన్‌లో ఉందనే రూమర్స్ వచ్చాయి. కానీ వీటిని మృణాల్ కొట్టిపారేసింది. రీసెంట్‌గా రిషభ్ పంత్, ఈమె ఒకరినొకరు ఇన్ స్టాలో ఫాలో చేసుకోవడంతో వీళ్లిద్దరూ ఏమైనా డేటింగ్ చేస్తున్నారా అని బాలీవుడ్ మీడియా గుసగుసలాడుకుంటోంది. అయితే పంత్ గురించి ఇలాంటి రూమర్స్ రావడం కొత్తేం కాదు. చాన్నాళ్ల క్రితం బాలీవుడ్ నటి ఊ?ర్వశి రౌతేలాతో రిలేషన్ అంటూ పుకార్లు వచ్చాయి. కానీ అవన్నీ రూమర్స్ అని తర్వాత క్లారిటీ వచ్చింది. ఇప్పుడు కూడా సోషల్ మీడియాలో హడావుడి తప్పితే నిజంగా అలాంటిదేమైనా ఉందా? లేదా అనేది మృణాల్, పంత్ చెప్పాలి. అప్పటివరకు ఈ గోల తప్పదు.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com